సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 9 । మే । 2023



శోభాయాత్ర పోస్టర్ విడుదల

వేములవాడ: వేములవాడ పట్టణంలో ఈనెల 12న జరిగే హనుమాన్ శోభాయాత్ర పోస్టర్‌ను డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేశ్, నిర్వాహకులు సోమవారం విడుదల చేశారు.



బోనమెత్తిన గుండన్నపల్లి

బోయినపల్లి: మండలంలోని గుండన్నపల్లిలో సోమవారం ముత్యాల పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు తీశారు.

గరిష్ఠం/కనిష్ఠం
37.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లా యోగా కోచ్‌కు అభినందన



జ్యోతిని అభినందిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేశ్

వేములవాడ: టైసా (తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈనెల 3 నుంచి 7 వరకు జరిగిన 3వ రాష్ట్రస్థాయి కోచెస్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో వేములవాడకు చెందిన లాల జ్యోతి రాజన్న సిరిసిల్ల జిల్లా కోచ్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈసందర్భంగా జ్యోతిని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ వెంకటేశ్ అభినందించారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ

ఇల్లంతకుంట(మానకొండూర్): గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్ అన్నారు. ఇల్లంతకుంట పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ, వాలీబాల్ పోటీలను సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని పేర్కొన్నారు. సమాజాభివృద్ధిలో యువత కీలకమన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్, ఎస్ఐ రాజేశ్, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తరుగు లేకుండా ధాన్యం కొనాలి



మాట్లాడుతున్న రమేశ్

సిరిసిల్లటౌన్: సీఎం ప్రకటించిన విధంగా రాష్ట్రంలో అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ఏలాంటి తరుగు తీయకుండా కొనాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల బీవైనగర్‌లోని పార్టీ ఆఫీసులో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. ప్రభుత్వం సరైన సమయంలో కొనుగోళ్లు ప్రారంభించనందునే జిల్లాలో రైతుల ధాన్యం తడిసి మొలకెత్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు సెంటర్లలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేక ఏటా రైతులకు వెతలు తప్పడం లేదన్నారు. వెంటనే పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో మద్దతు ధరకే కొనగోలు చేయాలన్నారు. లేకుంటే పెద్దెత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, ఒగ్గు గణేష్ తదితరులు ఉన్నారు.

పోలీసుల మోహరింపు



రుద్రవరం స్టేజీ వద్ద పోలీసులు

వేములవాడఅర్బన్: మండలంలోని రుద్రవరం – సంకెపల్లి గ్రామాల మధ్య సోమవారం భారీగా పోలీసులు బందోబస్తు చేపట్టారు. మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం మిడ్‌మానేరు ఐక్యవేదిక, అఖిలపక్షం నాయకులు సోమ, మంగళ, బుధవారం రుద్రవరం–సంకెపల్లి గ్రామాల మధ్య నిరవధిక నిరాహారదీక్ష చేస్తామని ప్రకటించారు. దీంతో ఈ నెల 7 నుంచి 12 వరకు 144 సెక్షన్ విధించడంతో పాటు ఆదివారం రాత్రి అఖిలపక్షం నాయకులను అరెస్ట్ చేశారు. కాగా అఖిలపక్షం నాయకులు నిరవధిక నిరహార దీక్షను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అయినా సోమవారం ఉదయం పోలీసులు భారీగా రుద్రవరం స్టేజీ వద్ద మోహరించారు. అలాగే నాంపల్లి, నందికమాన్ వద్ద చెక్‌పోస్టు పెట్టి తనిఖీలు చేశారు.

పట్టుకోండి చూద్దాం..!

- ఏ ఆఫీస్ ఎక్కడో.. తిరగాల్సిందే
- కలెక్టరేట్ ప్రారంభించి 22 నెలలైనా కనిపించని ప్రదర్శన బోర్డులు
- మూడు అంతస్తుల్లో ముప్పు తిప్పలు

సిరిసిల్ల: జిల్లా కలెక్టరేట్‌లో ఏ ఆఫీస్ ఎక్కడ ఉందో తెలిపే బోర్డు ఏర్పాటు చేయలేదు. ఫలితంగా వివిధ పనుల కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చే సామాన్యులు ప్రభుత్వ కార్యాలయాలను వెతికి పట్టుకోవడం ఓ ఫజిల్‌గా మారింది. 2021 జూలై 4న కలెక్టరేట్ సముదాయాన్ని సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. 22 నెలల కిందట కలెక్టరేట్‌ను ప్రారంభించినా ఇప్పటి వరకు ఏ ఆఫీస్ ఏ అంతస్తులో.. ఏ నంబరులో ఉందో తెలిపే ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



జిల్లా కలెక్టరేట్ సముదాయం

దరి చేరని అన్ని శాఖలు

కలెక్టరేట్ సముదాయం 45 ప్రభుత్వ శాఖలకు నిలయంగా ఉంది. జిల్లాలో ప్రధానమైన రెవెన్యూ, విద్య, వైద్యం, వ్యవసాయం, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, రోడ్లు భవనాలు, ఇరిగేషన్, మైనింగ్, మాతా శిశు సంక్షేమం వంటి ప్రభుత్వ శాఖలు కలెక్టరేట్ ప్రారంభించగానే వచ్చి తమకు కేటాయించిన ఛాంబర్‌లో ఆఫీస్‌లు ఏర్పాటు చేశారు. కానీ జిల్లాలోని ఇంకా కొన్ని ప్రభుత్వ శాఖల ఆఫీస్‌లు కలెక్టరేట్ సముదాయంలోకి రాలేదు. తూనికలు కొలతల శాఖ, మెడికల్ డ్రగ్ కంట్రోల్ శాఖల ఆఫీస్‌లు ఇంకా కలెక్టరేట్‌లోకి రాలేదు. ఇప్పటికీ అద్దె భవనాల్లో ఉన్నాయి. సదరు ఆఫీస్‌లను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయాలని కలెక్టరేట్ అధికారులు నోటీసులు జారీ చేసినా స్పందన లేదు. ప్రస్తుతం ఉన్న ఆఫీస్‌లు ఎక్కడ ఏ ఆఫీస్ ఉందో సూచించే బోర్డులను కలెక్టరేట్ ప్రవేశ ద్వారం వద్ద, కలెక్టరేట్ సముదాయంలోకి ప్రవేశించే చోట ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఇప్పటికీ పట్టించుకోవడం లేదు. అంతస్తుల వారీగా వివరాలు నమోదు చేసి బ్లాకుల వారీగా ఆఫీస్ వివరాలను వెల్లడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పని చేయని సీసీ కెమెరాలు

కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక చొరవతో ఇటీవల 44 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కెమెరాల నిఘాలో కలెక్టరేట్ కార్యకలాపాలు సాగుతున్నాయి. కానీ కొన్ని సీసీ కెమెరాలు పని చేయడం లేదు. వాటిని రిపేరు చేయాల్సిన టెక్నికల్ సిబ్బంది లేకపోవడం, కెమెరాలు ఏర్పాటు చేసిన ఏజెన్సీ వాళ్లు పట్టించుకోకపోవడంతో కొన్ని చోట్ల కెమెరాలు ఉన్నా అలంకార ప్రాయంగా మారింది. రగుడు సర్కిల్ వద్ద కలెక్టరేట్‌లోకి ప్రవేశించే ప్రదేశంలోనే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఇప్పటికైనా పని చేసేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కలెక్టరేట్ ఎంట్రన్స్‌లో పని చేయని సీసీ కెమెరాలు

బోర్డులు ఏర్పాటు చేయిస్తాం



కలెక్టరేట్‌లో ఏ ఆఫీస్ ఏ బ్లాక్‌లో ఉందో వివరించే బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బోర్డు సైజు, ఇతర అంశాలపై చర్చిస్తున్నాం. కలెక్టరేట్‌లో సీసీ కెమెరాలు పని చేస్తున్నాయి. ఏమైనా పని చేయకుంటే వాటిని రిపేరు చేయిస్తాం.

– బొద్దుల గంగయ్య, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్

రాజన్న సేవలో హైకోర్టు జడ్జి



హైకోర్టు జడ్జి శ్రీనివాస్‌రావుకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఏఈవో నవీన్, భీమాశంకరశర్మ

వేములవాడ: రాజన్నను సోమవారం హైకోర్టు జడ్జి జె.శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం వారికి పూర్ణకుంభ కలశతో ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి మహామంటపంలో వేదమూర్తుల మంత్రోచ్ఛారణల మధ్య ఏఈవో ప్రతాప నవీన్ స్వామివారి ప్రసాదం అందజేశారు. వారి వెంట జిల్లా జడ్జి ప్రేమలత, జడ్జి శ్రీలేఖ, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేశ్, ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

ఆలయ అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

హైకోర్టు జడ్జి శ్రీనివాస్‌రావు రాజన్నను దర్శించుకునేందుకు వస్తున్నట్లు ప్రొటోకాల్ ప్రకారం సమాచారం ఇచ్చినా వారిని సాదరంగా ఆహ్వానించి, స్వాగతం పలికేందుకు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ అందుబాటులో లేకపోవడంతో జిల్లా జడ్జి ప్రేమలత ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఏఈవో శ్రీనివాస్ సైతం అందుబాటులో లేకపోవడంతో మరింత అసహనం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆలయ అధికారులు అప్రమత్తమై ఏఈవో ప్రతాప నవీన్‌ను హైకోర్టు జడ్జి దర్శనాలకు సంబంధించిన విధులు నిర్వహించాలని ఆదేశించారు.

సిరిసిల్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం

సాక్షి స్పందన

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ ఏరియాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ సోమవారం ప్రారంభించారు. దాదాపు ఆరునెలల క్రితం ట్రయల్ రన్ చేసిన అధికారులు వాటిని వినియోగంలోకి తేవడం లేదంటూ 'సాక్షి'లో పలుమార్లు కథనాలు ప్రచురితమైనాయి. ఎట్టకేలకు సిగ్నల్స్‌ను ప్రారంభించిన అధికారులు వాటి నిబంధలు పాటించాలని లేకుంటే జరిమానా విధించే అవకాశాలుంటాయన్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కరీంనగర్‌లో హెల్మెట్ నిబంధనను అప్పటి సీపీ అమలు చేయగా ఇప్పటికీ వాహనదారుల్లో 80 శాతం మంది ఆ నిబంధన పాటిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి వాహనదారుడు బాధ్యతగా హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. కారక్రమంలో రాష్ట్ర టెక్స్‌టైల్ పవర్‌లూం కార్పొరేషన్ చైర్మన్ ప్రవీణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, గ్రంథాయల చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, డీఎస్పీ విశ్వప్రసాద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జింద చంద్రపాణి, కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, సీఐలు అనిల్‌కుమార్, ఉపేందర్, ట్రాఫిక్ ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కళ



పోటెత్తిన భక్తజనం

వేములవాడ: వేసవి సెలవులు కొనసాగడం, శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన సోమవారం కావడంతో 40 వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రద్దీని గమనించిన ఆలయ అధికారులు అభిషేకాలు, అన్నపూజలను కట్టడి చేశారు. మండుతున్న ఎండలకు భక్తులు క్యూలైన్లలో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతూ గోలగోల చేశారు. వీఐపీల దర్శనం సమయంలో క్యూలైన్లలో వేచి చూసిన భక్తులు అసహనం వ్యక్తం చేశారు. పలువురు ఆలయ అధికారులు, ఎస్పీఎఫ్, హోంగార్డులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసాదాలు కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. కల్యాణకట్టలో సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడినట్లు చెప్పారు. కాగా భక్తుల ద్వారా రూ.30 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో నవీన్, పర్యవేక్షకుడు తిరుపతిరావు భక్తుల ఏర్పాట్లను, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేశ్ బందోబస్తు పరిశీలించారు.

నిరసనలతో దద్దరిల్లిన కలెక్టరేట్

సిరిసిల్లటౌన్: నిరసనలు, ధర్నాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. సోమవారం వివిధ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. వరుస కార్యక్రమాలతో కలెక్టరేట్ ప్రాంగణం హోరెత్తింది. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నినదించారు.

కనీస వేతనాలివ్వాలి



వినతిపత్రం ఇస్తున్న వీఓఏలు

ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనాలు అమలు చేయాలని ఐకేపీ వీవోఏలు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న తమను సర్కారు గుర్తించాలని కోరారు. కనీస వేతనం రూ.18వేలు అమలు చేస్తూ, పీఆర్సీ అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను విన్నవిస్తూ కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు మంత్రి మడమ్మ, ప్రధాన కార్యదర్శి భూక్య రజిత, కోశాధికారి గొడుగు బాలలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయితీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి ప్రవీణ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. టీపీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఇన్ని రోజులు మండల కేంద్రాల్లో చేపడుతున్న నిరవధిక సమ్మెను జిల్లా కేంద్రానికి మార్చినట్లు పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమితులైన కార్యదర్శులను సర్వీస్‌లోకి తీసుకోవాలని, విధి నిర్వహణలో మరణించిన కార్యదర్శుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగమివ్వాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి రాజునాయక్, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కలెక్టరేట్‌కు తరలివచ్చిన సర్పంచులు

గ్రామ పంచాయితీల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు ఇంకెన్ని రోజులు పెండింగ్‌లో ఉంచుతారని సర్పంచులు ప్రశ్నించారు. కలెక్టరేట్‌కు తరలివచ్చి ధర్నా చేపటట్టారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో ముందుండాలన్న తపనతో సర్పంచులు ముందుకు వస్తే ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు చేపట్టిన పనుల బిల్లులు పూర్తిగా అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే తీవ్ర నిరసనలు చేపడుతామన్నారు. తమ సమస్యలను విన్నవిస్తూ కలెక్టరేట్ ఏవో గంగయ్యకు వినతిపత్రం అందించారు.



ధర్నాలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

స్టాకు ఉన్నంత వరకు పాత ధరలే!

- ఐఎంఎల్ డిపోలో పూర్తయిన లేబులింగ్
- తగ్గిన లిక్కర్ ధరలు నేటి నుంచి విక్రయాలు
- నిమిషానికి 78 బీర్లు పీల్చేసిన పాత జిల్లా
- ఏడురోజుల్లో రూ.23 కోట్ల బీర్లు లేపిన మందుబాబులు



ఎలాగో తెలియక వైన్‌షాపుల నిర్వాహకులు తల పట్టుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'రాజు వరమిచ్చినా.. మంత్రి అడ్డుకున్నట్లు'గా ఉంది మందుబాబుల పరిస్థితి. ప్రభుత్వం మద్యం ధరలు తగ్గించినట్లు ప్రకటించి మూడురోజులు గడుస్తున్నా.. సరుకుపై ధరలు తగ్గించకపోవడంపై మందుబాబులు మండిపడుతున్నారు. దీనిపై వైన్‌షాపుల యజమానులు మాత్రం తమకు కొత్త స్టాకు వచ్చేంత వరకు పాతధరలే కొనసాగుతాయని చెబుతున్నారు. ఈనెల 5 నుంచి మద్యంపై ధరలను ప్రభుత్వం సవరించింది. ఫుల్‌బాటిల్‌పై రూ.40, హాఫ్ బాటిల్‌పై రూ.20, క్వార్టర్‌పై రూ.10 చొప్పున తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆదేశాలు తక్షణమే అమలులోకి వస్తాయని కూడా చెప్పింది. అయితే దీన్ని క్షేత్రస్థాయిలో మందుబాబులు తప్పుగా అర్థం చేసుకున్నారు. దీంతో శని, ఆది, సోమ వారాల్లో మద్యం ధరలు తగ్గాయి కదా? అంటూ వాగ్వాదానికి దిగుతున్నారు. వారికి సర్ది చెప్పడం

దాదాపు పూర్తయిన లేబులింగ్..

ప్రభుత్వం మద్యం ధరలను సవరించిన ప్రతీసారి ప్రభుత్వం కొత్త లేబులింగ్‌తో మద్యం సీసాలు విక్రయిస్తుంది. ఆదేశాలు వెలువడిన అనంతరం తక్షణమే అమలు కావాలి. కానీ అప్పటికే మద్యం షాపులు కొని తెచ్చుకున్న స్టాకు అలాగే ఉండిపోయింది. చాలాషాపుల్లో స్టాకు వారం పది రోజులకు ఒకసారి మారుస్తారు. పాత ధరలకు కొన్న రేట్లకే ఆ మద్యాన్ని అమ్ముకునే వీలుంది. ఎక్కువకు కొని తక్కువకు ఎవరూ విక్రయించరు కదా! ఈ మేరకు ఎక్సైజ్‌శాఖ కూడా వీరికి పాత స్టాకును, పాత ధరలకు విక్రయించుకునేందుకు పచ్చజెండా ఊపింది. ఈలోపు ఐఎంఎల్ గోదాముల్లో ఉన్న లిక్కర్ స్టాకు లేబులింగ్ మార్చాల్సి వచ్చింది. పాత ధరలతో ఉన్న స్టాకుపై కొత్తగా సవరించిన ధరలను ముద్రించిన లేబుళ్లను వేస్తున్నారు. శని, ఆది, సోమవారాల్లోనూ ఈ ప్రక్రియ కొనసాగింది. మంగళవారం నుంచి ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్‌లోని వైన్‌షాపులకు వెళ్లే స్టాకుపై కొత్తగా ముద్రించిన లేబులింగ్ ప్రకారం మద్యం సీసాలు విక్రయించనున్నారు. ఈ వ్యవహారం తెలియని మందుబాబులు మాత్రం పాత ధరలకే మద్యం విక్రయిస్తున్నారంటూ యజమానులతో గొడవకు దిగుతున్నారు.

పాత ధరలకు విక్రయిస్తే చర్యలు

ధరల విషయంలో ఇప్పటికే పలువురు ఎక్సైజ్ అధికారులకు పలువురు మద్యం ప్రియులు ఫిర్యాదులు చేస్తున్నారు. పాత లేబుల్ ఉన్నవాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేమని పాత స్టాకు ఉన్నంత వరకు పాత ధరలు అమలవుతాయని, కొత్త లేబులింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత పాత ధరలతో విక్రయిస్తే మాత్రం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

వారంలో కరీంనగర్ ఐఎంఎల్ డిపోలో మద్యం విక్రయాలు

లిక్కర్	విలువ
13,901 పెట్టెలు	రూ.11.12 కోట్లు
బీర్లు	విలువ
65,961 పెట్టెలు	రూ.23.17 కోట్లు

(మే1 నుంచి 7 వరకు జరిగిన విక్రయాలు)

నిమిషానికి 78 బీర్లు..!

వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో బీర్లకు డిమాండ్ పెరిగింది. మే మొదలైనప్పటి నుంచి ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లోని మందుబాబులు బీర్లను తెగతాగేశారు. మే 1 నుంచి 7వరకు రూ.23.17 కోట్ల విలువైన 65,961 కాటన్ల బీర్లు అమ్ముడుపోయా యి. కాటన్‌కు 12 బీర్లు చొప్పున మొత్తం 7,91,532 బీర్లు విక్రయించారు. ఈ లెక్కన రోజుకు 1,13,076 బీర్లు, ప్రతీ గంటకు 4,711, నిమిషానికి 78 చొప్పున బీర్లు తాగేశారు. వేసవి తాపానికి మద్యంప్రియులు అంతా బీర్లకు మారుతున్నారు. లిక్కర్ ధరలో మినహాయింపు ఇచ్చిన ప్రభుత్వం బీర్ల ధరల్లో ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు. అయినా మందుబాబులు చల్లగా బీర్లను పీల్చేస్తున్నారు.

ధాన్యం తరలింపులో వేగం పెంచాలి



రైతులతో మాట్లాడుతున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ధాన్యాన్ని కేంద్రాల్లో తూకం వేసిన వెంటనే రైస్ మిల్లులకు తరలించడంలో వేగం పెంచాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేటలోని కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం తడిసిన ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర కల్పిస్తుందన్నారు. తూకం వేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించడానికి వారితో మాట్లాడుతున్నట్లు తెలిపారు. కాగా తడిసిన ధాన్యం మొలకెత్తుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గన్నసాయి,మల్లారెడ్డి, పద్మారెడ్డి తదితరులున్నారు.

కంటి వెలుగులో 3,836 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో సోమవారం కంటి వెలుగులో 3,836 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 26 ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో 234 మంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో 690 మందికి రీడింగ్, 543 మందికి పాయింట్ కంటి అద్దాలు అందించారు.

క్లుప్తంగా

హోంగార్డులకు హెల్త్‌కార్డుల పంపిణీ


హెల్త్ కార్డులతో హోంగార్డులు

సిరిసిల్ల క్రైం : జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులకు హెల్త్‌కార్డులను ఎస్పీ అఖిల్ మహాజన్ అందజేశారు. ఇండియన్ మెడికల్ కౌన్సిలర్ సహకారంతో ఈ కార్డులు అందుబాటులోకి రాగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ పంపిణీ చేశారు. దీంతో జిల్లాలో పనిచేస్తున్న 202 మంది హోంగార్డులు, వారి కుటుంబీకులకు లబ్ధి చేకూరుతుందన్నారు. సిరిసిల్లలో 10, ముస్తాబాద్‌లోని 2, ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆస్పత్రిలో సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ యాదగిరి, సీఐ అనిల్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, హోంగార్డులు, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం


నియామక పత్రం అందుకుంటున్న ఉమాశంకర్

గంభీరావుపేట (సిరిసిల్ల): అంతర్జాతీయ మానవ హక్కుల కమీషన్ రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని లింగన్నపేటకు చెందిన ఎలిమెల ఉమాశంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు షేక్‌గౌస్, సౌత్ ఇండియా ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు అన్వర్ అలీ చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

170 మంది జేపీఎస్‌లకు నోటీసులు

సిరిసిల్ల: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్) సమ్మె విరమించి విధుల్లో చేరాలని, లేకుంటే ఉద్యోగాల్లోంచి తొలగిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం నోటీసులు జారీ చేశారు. జిల్లాలో సమ్మె చేస్తున్న 170 మంది జేపీఎస్‌లకు ఎంపీడీవోల ద్వారా సోమవారం నోటీసులను జారీ చేసినట్లు డీపీవో ఎ.రవీందర్ తెలిపారు. మంగళవారం సాయంత్రంలోగా విధుల్లో చేరకుంటే వారిని ఉద్యోగాల్లోంచి తొలగిస్తామని నోటీసులో పేర్కొన్నారు.

మల్కాపూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ


మల్కాపూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

బోయినపల్లి(చొప్పదండి): జమ్ముకాశ్మీర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన జవాన్ పబ్బాల అనిల్ మృతికి సంతాపంగా సోమవారం రాత్రి గ్రామస్తులు, యువకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జవాన్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. సర్పంచు కోరెపు నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ అప్పగింత



వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు నిర్మల్ జిల్లా ఖానాపూర్ నుంచి వచ్చిన ముద్దం నారాయణ తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. నరేశ్ అనే దివ్యాంగుడికి దొరకడంతో సెల్‌ఫోన్‌ను తిరిగి నారాయణకు అప్పగించి పెద్దమనసు చాటుకున్నాడు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- సమస్యలు పరిష్కరించాలని వేడుకున్న బాధితులు


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి బాధితులు వచ్చి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్‌జయంతికి మొరపెట్టుకున్నారు. కలెక్టర్ వినతిపత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొత్తం 27 దరఖాస్తులు స్వీకరించారు. పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వేములవాడకు చెందిన వినయ్‌కుమార్ అనే దివ్యాంగుడు తనకు ఏదైనా ఉపాధి కల్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, పవన్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గూడు కల్పించండి

మాది బోయిన్‌పల్లి మండలం. నాపేరు బోడ దుర్గమ్మ. నాకు కాలు లేదు. ఏపని చేసుకోలేను. చెవులు కూడా సరిగా వినపడవు. ఐదు గజాల స్థలంలో చిన్న ఇంట్లో ఉంటున్నా. మూడేళ్ల నుంచి బియ్యం రావడం లేదు. దీంతో రూ. 3వేల పెన్షన్ సరిపోవడం లేదు. అధికారులు స్పందించి వినికిడి యంత్రంతో పాటు, రేషన్ బియ్యం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలి.


కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగురాలు దుర్గమ్మ

అంత్యోదయ కార్డులు బదిలీ చేయండి


కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన కేసీఆర్‌నగర్ కాలనీవాసులు

మేము మండపెల్లి కేసీఆర్ నగర్ కాలనీవాసులం. ఎఫ్ఎస్‌సీ ఏఎఫ్ఎస్‌సీ అంత్యోదయ కార్డు లబ్ధిదారులకు మండేపల్లిలోని రేషన్ డీలర్ బియ్యం ఇవ్వడం లేదు. కార్డులను సిరిసిల్ల పరిధి నుంచి కేసీఆర్‌నగర్ కాలనీకి ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలంటున్నారు. ప్రతి నెలా సిరిసిల్లకు వచ్చి బియ్యం తీసుకోవాలంటే వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మా కార్డులను కేసీఆర్‌నగర్ కాలనీ పరిధిలోని రేషన్‌షాపునకు బదిలీ చేయాలి.

మంత్రి కేటీఆర్ కృషితో ఆక్వా హబ్


మాట్లాడుతున్న పర్శ హన్మాండ్లు

గంభీరావుపేట (సిరిసిల్ల): మంత్రి కేటీఆర్ కృషితో ప్రపంచంలోనే అతిపెద్ద ఆక్వా హబ్ సిరిసిల్లలోని మధ్యమానేర్ ప్రాజెక్టు వద్ద రూ.1300 కోట్లతో ఏర్పాటు కాబోతున్నట్లు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మాండ్లు అన్నారు. మండలంలోని లింగన్నపేటలో సోమవారం ముదిరాజ్‌ల సింహగర్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదివేల మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా 367 ఎకరాల్లో 600 యూనిట్లు నెలకొల్పనున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో అగ్రభాగాన నిలుపుతున్న మంత్రి కేటీఆర్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పర్శరాములు, ఆంజనేయులు, నారాయణ, దేవయ్య, పోచయ్య, ఎల్లయ్య, శ్రీనివాస్, నర్సింలు, మల్లేశం, రాజం, తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ


మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

తంగళ్లపల్లి (సిరిసిల్ల) : ఈనెల 14న హనుమాన్ జయంతి సందర్భంగా ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించనున్న హిందూ ఏక్తా యాత్రకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కండేయస్వామి ఆలయంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకేంద్రం నుంచి వేలాదిగా ర్యాలీగా హిందూ ఏక్తాయాత్రలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సురువు వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, రేగుల మల్లికార్జున్, వేములవాడ ఎంపీపీ బండ మల్లేశం, మండల ప్రధాన కార్యదర్శి సందెవేణి రాజు యాదవ్, యువమోర్చా అధ్యక్షుడు కోల ఆంజనేయులు, మహిళా మోర్చా అధ్యక్షురాలు కోడం భవిత, ఓబీసీ అధ్యక్షుడు చరణ్, దళితమోర్చా అధ్యక్షుడు సిరిసిల్ల వంశీ, తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులతోనే గ్రామాల అభివృద్ధి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్


మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

ముస్తాబాద్ (సిరిసిల్ల): సహకార బ్యాంకులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆవునూర్‌లో కేంద్ర సహకార బ్యాంక్ నూతన కార్యాలయం భవనాన్ని సోమవారం టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సహకార బ్యాంకులతోపాటు సహకార సంఘాలు కార్పొరేట్ స్థాయి సేవలను అందిస్తున్నాయన్నారు. కేంద్రం పెత్తందారి కార్పొరేట్లకు వత్తాసు పలుకుతూ రైతులు, సహకార బ్యాంక్‌లను నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యేలు మోహన్‌రెడ్డి, ఆరెపల్లి మోహన్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, గ్రంథాలయ చైర్మన్ శంకరయ్య, ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆర్‌బీఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, సింగిల్‌విండో చైర్మన్లు తన్నీరు బాపురావు, రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- స్తంభంపల్లిలో ఘటన
- మృతుడు నిజామాబాద్ జిల్లా వాసి
- ప్రేమ వ్యవహారమే కారణమా..?


రవితేజ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని స్తంభంపల్లిలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన సోమవారం జరిగింది. పోలీసుల వివరాలు.. నిజామాబాద్ జిల్లా జాక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణపల్లి హామ్లెట్ గాంధీనగర్ గ్రామానికి చెందిన అందె రవితేజ (23) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో భోజనం చేస్తున్న సమయంలో ఫోన్ వచ్చింది. భోజనం అనంతరం వాహనంలో పడుకుంటా అని చెప్పి ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో స్తంభంపల్లి గ్రామంలో తమ బంధువుల ఇంటికి రవితేజ వచ్చాడు. అక్కడ గేటు వేసి ఉండడంతో గేటు దూకి లోపలికి వెళ్లాడు. తలుపులు తీయాలని బాదడతంతో బంధువులు తీయలేదు. బంధువుల బయటకు వచ్చి చూడగా అతడు అప్పటికే నిప్పంటించుకున్నాడు. ఈ క్రమంలో 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై మహేందర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రవితేజ మృతి విషయం అతడి తల్లి జ్యోతికి ఫోన్‌చేసి చెప్పారు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కాగా స్తంభంపల్లిలో ఘటన జరిగిన ఇంటి పరిసరాల్లో అక్కడ ఆరిన రక్తపు మరకలు ఉన్నాయని మృతుడి తల్లి జ్యోతి ఫిర్యాదులో పేర్కొంది. తన కుమారుడు రవితేజకు బంధువుల అమ్మాయితో ప్రేమ వ్యవహారం ఉందని ఈ క్రమంలోనే తన కుమారున్ని కత్తితో పొడిచి హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, బంధువుల యువతి, ఆమె తల్లి, మేనమామ, అల్లుడి అనుమానం ఉందని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఘటనా స్థలాన్ని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ బన్సీలాల్ సందర్శించారు.

బంధువుల ఆందోళన

సిరిసిల్లటౌన్: బోయినపల్లి మండలం స్తంభంపల్లిలో మృతిచెందిన అల్లె రవితేజ బంధువులు సోమవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని రోడ్డుపై బైఠాయించారు. జిల్లాసుపత్రిలో పోస్టుమార్టం జరుగుతుండగా, ఈ కేసులో దోషులుగా ఆరోపిస్తూ సమీప బంధువులతో గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్ వచ్చి రవితేజ బంధువులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ..

- హనుమాన్ భక్తులకు గాయాలు

బోయినపల్లి (చొప్పదండి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు హనుమాన్ భక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లికి చెందిన కీసర వెంకటేశ్, మామిడి సంపత్ పాదయాత్రగా వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్తున్నారు. కొదురుపాక గ్రామ సమీపం వద్ద వేములవాడ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కీసర వెంకటేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంపత్‌కు స్వల్ప గాయాలుకాగా చికిత్స నిమిత్తం ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు.

అభివృద్ధి పనులకు ఇసుక కొరత రానీయొద్దు

- కలెక్టర్ అనురాగ్ జయంతి


మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో అభివృద్ధి పనులకు ఇసుక కొరత రానీయొద్దని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, భూగర్భ జలశాఖల అధికారులతో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. వేములవాడ మూలవాగులో చెక్‌డ్యాం ముంపు ప్రాంతం నుంచి స్థానిక అవసరాలకు ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతించామని, ఎలాంటి యంత్రాలను వాడకుండా ఇసుకను స్థానిక అవసరాలకు తీసుకెళ్లవచ్చన్నారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్–మల్లుపల్లె మధ్యలో గల లోతు వాగుపై వేసిన ఇసుక మేటలతో బ్రిడ్జికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని, పంట పొలాలు ముంపునకు గురి అవుతున్నాయని, ఆ ఇసుక మేటలను తొలగించేందుకు అనుమతి ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఇసుక సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే ఆర్డీవోలు సమీక్షించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవోలు టి.శ్రీనివాస్‌రావు, పి.పవన్‌కుమార్, డీపీవో రవీందర్, మైనింగ్ అధికారి సైదులు, భూగర్భ జలశాఖ అధికారి నర్సింహులు, ఇరిగేషన్ ఈఈ అమరేందర్ రెడ్డి, తహసీల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించాలి

జిల్లాలో ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాధాన్యత అంశాల అమలు తీరును పరిశీలించాలని, ఏమైనా సమస్యలు ఉంటే తనకు నివేదించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు, 'మన ఊరు.. మన బడి' పనుల ప్రగతి తదితర అంశాలపై దృష్టిసారించాలన్నారు. ప్రతి శుక్రవారం క్షేత్రస్థాయిలో సందర్శించి తనకు నివేదించాలని కలెక్టర్ కోరారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి


రాజు మృతదేహం

సిరిసిల్ల అర్బన్: ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి సెంట్రింగ్ కార్మికుడు మృతిచెందిన సంఘటన సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు బాబాజీనగర్ కాలనీలో సోమవారం జరిగింది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లె గ్రామానికి చెందిన ములిగె రాజు (34) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే పెద్దూరు బాబాజీనగర్ కాలనీలో లింగం అనే వ్యక్తికి చెందిన భవనం నిర్మాణ పనికి కూలీగా వెళ్లాడు. రెండో అంతస్తులో సెంట్రింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ఈ ఘటనలో రాజుకు తీవ్రగాయాలు కాగా స్థానికులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి, అక్కడినుంచి కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య చిట్టి, కుమారుడు మనోజ్, కూతురు దీప్తిక ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫిట్స్‌తో మతిస్థిమితం లేని వ్యక్తి..


వేణు మృతదేహం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన గోనె వేణు (53) ఆదివారం రాత్రి ఫిట్స్‌తో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వేణు కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. కొన్నిరోజుల నుంచి స్థానిక వృద్ధ సంరక్షణ కేంద్రంలో ఉంటున్నట్లు తెలిసింది. రాత్రి బయటకు వెళ్లగా ఫిట్స్ రావడంతో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య చంద్రకళ, కుమారుడు ప్రదీప్, కూతురు రమ్య ఉండగా సిరిసిల్లలో నివాసముంటున్నారు. మృతదేహాన్ని దహన సంస్కారాల కోసం సిరిసిల్లకు తరలించారు.

పిడుగుపాటుతో ఎద్దు..

కోనరావుపేట : మండలంలోని నిజామాబాద్‌లో పిడుగుపాటుతో ఎద్దు మృతిచెందింది. గ్రామానికి చెందిన నోముల తిరుపతి రెడ్డి అనే రైతు తన ఎద్దును పొలం వద్ద చెట్టుకు కట్టివేశాడు. సోమవారం వేకువజామున వెళ్లి చూసేసరికి మృతిచెంది ఉంది. పిడుగుపాటుకు మృతిచెంది ఉండవచ్చని, సుమారు రూ. 80 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

యువకుడి అదృశ్యం


మహేశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాల గ్రామానికి చెందిన ఉల్లి మహేశ్ (26) అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాలు.. మహేశ్ రెండు రోజులుగా కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన సోదరుడు అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు 75696 95672, 94419 67358 నంబర్లకు ఫోన్ చేయాలని కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బందనకల్‌లో అకాల వర్షం


ధాన్యం కొట్టుకుపోకుండా ఆరాట పడుతున్న రైతులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని బందనకల్, వెంకట్రావుపల్లెలో సోమవారం అకాల వర్షానికి ధాన్యం తడిసింది. ఒకవైపు ఎండలు ఉన్నాయనే భరోసాతో ధాన్యం ఆరబోశామని రైతు రామచంద్రారెడ్డి తెలిపారు. ఒక్కసారిగా భారీ వాన కురవడంతో కేంద్రంలో ధాన్యం తడిసిపోయిందని, కొంత కొట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ధాన్యం కొట్టుకుపోకుండా రైతులు తీవ్రంగా శ్రమించారు.

ఈదురు గాలులకు విరిగిన చెట్లు

బోయినపల్లి(చొప్పదండి): మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాల పరిసరాల్లో సోమవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో ఓ చెట్టు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. స్తంభంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి బోయినపల్లి సబ్‌స్టేషన్ లింక్ లైన్‌కు సంబంధించిన పోల్‌పై తుమ్మ చెట్టు విరిగి పడడంతో పోల్ మధ్యలోకి విరిగింది. ఈ క్రమంలో బోయినపల్లిలో చాలాసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగగా, సాయత్రం సరఫరా మెరుగైంది.

గాలివాన బీభత్సం..

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. దుమాలలో ఈదురుగాలులకు ఇళ్ల పైకప్పులు, రేకులు లేచిపోయాయి. గ్రామానికి చెందిన బైరి లక్ష్మయ్య ఇల్లు పూర్తిగా కూలిపోయింది. సల్మాల లచ్చయ్య, మల్లయ్య ఇళ్ల పై కప్పులు లేచిపోయాయి. సుమారు రెండుగంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో పంటలకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాలాంటి కడుపుకోత ఎవరికీ వద్దు

- కలెక్టర్‌తో ఓ తల్లి ఆవేదన

సిరిసిల్లటౌన్: 'కేటీఆర్ సార్.. ప్రైవేట్ వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి ప్రాణాలు పోగొట్టుకున్నాం. ఇటువంటి కడుపుకోత ఏ తల్లిదండ్రులకు రానివ్వద్దంటూ.. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఈమేరకు కలెక్టర్ అనురాగ్‌జయంతి, డీఎంహెచ్‌వో సుమన్‌రావులకు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాలు.. ముస్తాబాద్ మండలం తుర్కపల్లికి చెందిన కర్రోళ్ల జ్యోతి– రాజు దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురు 7 సంవత్సరాలు, చిన్నకూతురు 5 నెలల వయస్సు. కొద్ది రోజుల క్రితం చిన్నపాప ఆరోగ్యం బాగా లేక వాంతులు అవుతుంటే సిరిసిల్ల పాతబస్టాండు సమీపంలోని ఓ పిల్లల ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ఫిట్స్ వస్తున్నాయని తమ ఆస్పత్రికి అనుబంధమైన మరో ఆస్పత్రిలో అడ్మిట్ చేసి ట్రీట్‌మెంట్ ఇచ్చారు. రోజులో నాలుగు సార్లు ఫిట్స్ వస్తున్నాయని పాపకు అధిక డోసులో మందులు ఇచ్చారని, దీంతో వైద్యులతో గొడవపడి హైదరాబాద్ తీసుకెళ్తుండగా పాప స్పర్శ కోల్పోయింది. హైదరాబాద్ ఆస్పత్రిలోని వైద్యులు పరీక్షలు చేసి మెదడువాపుగా గుర్తించి ట్రీట్‌మెంట్ ఇచ్చారు. కాగా సిరిసిల్లలో అందిన వైద్యం వికటించడంతోనే పాప ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. ఈవిషయంలో న్యాయం జరుపాలని మంత్రిని కోరారు.

ఎలాంటి విచారణకైనా సిద్ధం

పాపకు జరిగిన హానిలో తమ పొరపాటు ఏమిలేదని చికిత్స అందించిన వైద్యుడు వివరించారు. పాపకు వాంతులని ఏప్రిల్ 26న తీసుకురాగా ఫిట్స్‌గా గుర్తించి ట్రీట్‌మెంట్ ఆరంభించాం. మావద్ద రికవరీ అవుతుందని చెప్పినా వినలేదు. హైదరాబాద్‌లో ట్రీట్‌మెంట్ తీసుకుంటూ చనిపోయిందని తెలిసింది. ఐసీయూలో పాపను అబ్జర్వేషన్ కోసమే మా అనుబంధ ఆస్పత్రిలో ఉంచి చికిత్స అందించాం. మావద్ద చికిత్సలో ఏలాంటి పొరపాటు జరుగలేదు. పాప తల్లిదండ్రులు చేస్తున్న ఆరోపణల్లో ఏలాంటి నిజం లేదు.

ఆలయం బయట రాజన్న కోడెలు


భక్తుల మధ్యలో కోడె

వేములవాడ: గోశాల, ఆలయంలో ఉండాల్సిన రాజన్న కోడెలు కొన్ని బయట తిరుగుతున్నాయి. సోమవారం దాదాపు 40వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు రాగా ఆలయం బయట రెండు కోడెలు భక్తుల మధ్యలో తిరుగుతూ ఇబ్బందులకు గురిచేశాయి. దీంతో భక్తులు భయంతో పరుగులు తీశారు.

ఈవోకు ఫిర్యాదు..

ఆలయం వద్ద సరైన సౌకర్యాలు కల్పించడం లేదని, పలువురిని ఎగ్జిట్ డోర్ నుంచి పంపిస్తున్నారని భక్తులు ఈవో కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హోంగార్డులు, ఎస్పీఎఫ్ సిబ్బందికి విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించినట్లు తెలిసింది. కోడెలు యథేచ్ఛగా తిరుగుతున్నాయంటూ పలువురు భక్తులు ఫిర్యాదు చేశారు.

భారీ వర్షం..

పట్టణంలో భారీ వర్షం కురిసింది. దాదాపు అరగంటసేపు వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు కాస్త ఉపశమనం లభించినట్లయింది. రాజన్న ఆలయంలో భక్తులు వర్షంలోనే మొక్కులు చెల్లించుకున్నారు.

ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు..

రాజన్నను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు పెద్ద ఎత్తున తరలిరాగా పట్టణంలోని రోడ్లన్నీ ట్రాఫిక్ జామ్ అయ్యాయి. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

రహదారిపై కొండచిలువ


సర్దాపూర్‌లో రోడ్డుపై కొండచిలువ

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల ప్రధాన రహదారి సర్దాపూర్ బెటాలియర్ రోడ్డుపై కొండచిలువ కనిపించింది. వాహనాదారులల వివరాలు.. ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్లకు వస్తున్న ఓ ద్విచక్రవాహనదారుడుకి రోడ్డుపై ఏదో పాకుతూ వెళ్తున్నట్లు కనిపించింది. వెంటనే బైక్ కాస్త పక్కకు నిలిపి లైట్ వెలుతురులో చూసే సరికి కొండచిలువ రోడ్డుపై నుంచి చెట్లలోకి వెళ్తోంది. ఇంకాస్తయితే దానిమీద నుంచి బైక్ వెళ్లేదని పలువురు వాహనదారులు చర్చించుకుంటున్నారు. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది.

'ఆలన' కార్యక్రమంపై శ్రద్ధ వహించాలి


శిక్షణలో పాల్గొన్న వైద్యశాఖ సిబ్బంది

సిరిసిల్లటౌన్: మంచానికే పరిమితమైన రోగుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆలన' కార్యక్రమంపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాములు అన్నారు. సోమవారం జిల్లా వైద్యాధికారి ఆఫీసులో జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఆలన కార్యక్రమం ద్వారా రోగి ఇంటికే వెళ్లి వైద్యం అందించబడుతుందన్నారు. జిల్లాలో టీబీ(క్షయ)నివారణపై సూచనలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీలకు వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. డాక్టర్లు ఎస్.రజిత, మహేష్ తదితరులు పాల్గొన్నారు.